




ప్రజా
# రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్పార్క్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 237 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/- బుధవారం 02 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888 Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


### లోక్‌సభ ముందుకు వక్ఫ్ బిల్లు..
## ప్రవేశపెట్టిన కేంద్రం

వక్ఫ్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిపై సభలో చర్చ చేపట్టారు.

ఢిల్లీ, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): వివాదాస్పద వక్ఫ్ (సవరణ) బిల్లు లోక్సభ ముందుకువచ్చింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా విపక్షాలు ఆందోళన చేపట్టాయి. వారి నిరసనల నడుమ బుధవారం మధ్యాహ్నం కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీని పై రిజిజు చర్చ చేపట్టారు. దాదాపు 8 గంటల పాటు చర్చ జరిపిన అనంతరం ఓటింగ్ నిర్వహించనున్నారు.



ఈ బిల్లును ఆమోదింపజేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పట్టుదలతో ఉండగా విపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. వర్ఫ్ పాలకవర్గాల్లో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ పాలనలో మహిళల భాగస్వామ్యం తప్పనిసరి చేసేలా ఈ కొత్త బిల్లును కేంద్రం తీసుకొచ్చింది. ఈ మేరకు 1995 నాటి వక్స్ చట్టంలో దాదాపు 40 సవరణలు చోటుచేసుకోనున్నాయి. ముస్లిం సమాజం నుంచి వస్తున్న డిమాండ్ల మేరకే ఈ మార్పులు చేస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. ఈ బిల్లును గతేడాది ఆగస్టులోనే కేంద్రం లోకసభలో ప్రవేశపెట్టింది. అప్పుడు దీనిపై విపక్షాల నుంచి పెద్దఎత్తున వ్యతిరేకత రావడంతో దీనిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపింది. ఈ కమిటీ పలు ప్రతిపాదనలతో బిల్లుకు ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో వక్స్ బిల్లును కేంద్రం నేడు లోక్సభ ముందుకు తీసుకొచ్చింది. లోక్సభలో ఆమోదం పొందిన తర్వాత గురువారం రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఉభయ సభల్లో అధికార ఎన్డీయేకు మెజారిటీ ఉన్నందున బిల్లు ఆమోదానికి ఎలాంటి ఇబ్బంది ఉండదని భాజపా భావిస్తోంది.

### అక్రమ మైనింగ్ కేసు..
## కాకాణి గోవర్ధన్కు మరోసారి నోటీసులు

అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి నెల్లూరు జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు.




హైదరాబాద్, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): అక్రమ మైనింగ్ కేసులో విచారణకు హాజరు కావాలంటూ వైకాపా నేత కాకాణి గోవర్ధన్ రెడ్డికి నెల్లూరు జిల్లా పోలీసులు మరోసారి నోటీసులు ఇచ్చారు. హైదరాబాద్ లోని శ్రీనగర్ కాలనీలోని కాకాణి నివాసానికి వెళ్లిన కావలి డీఎస్పీ నేతృత్వంలోని పోలీసు బృందం.. ఆయనకు నోటీసులు ఇచ్చేందుకు ప్రయత్నించారు. కాకాణి ఇంట్లో లేరని చెప్పడంతో ఆయన బంధువులకు నోటీసులు ఇచ్చారు. అక్రమ మైనింగ్ కేసులో ఏప్రిల్ 3న (గురువారం) నెల్లూరు రూరల్ డీఎస్పీ ఎదుట విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఇప్పటికే రెండు సార్లు కాకాణికి నోటీసులు అందజేసినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాకపోవడంతో మరోసారి నోటీసులు ఇచ్చారు.

## కంచ గచ్చిబౌలి భూముల్లో రేపటివరకు పనులు ఆపాలి : తెలంగాణ హైకోర్టు

నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి.

హైదరాబాద్, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): నగరంలోని కంచ గచ్చిబౌలి భూములపై వట ఫౌండేషన్, హెచ్సీయూ విద్యార్థులు దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వాదనలు విన్న ధర్మాసనం.. కంచ గచ్చిబౌలి భూముల్లో ఏప్రిల్ 3 (గురువారం) వరకు పనులు ఆపాలని ఆదేశించింది. పిటిషన్పై తదుపరి విచారణను ఏప్రిల్ 3వ తేదీకి వాయిదా వేసింది. కంచ గచ్చిబౌలి భూములను జాతీయ ఉద్యానవనంగా ప్రకటించాలని వట ఫౌండేషన్, హెచ్సీయూ విద్యార్థులు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు కొనసాగాయి. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్సీయూ) తరఫున ఎల్. రవిశంకర్ వాదనలు వినిపించారు. "గత ఏడాది జూన్లో రాష్ట్ర ప్రభుత్వం జీవో 54 తీసుకొచ్చింది. ఈ జీవో ప్రకారం 400 ఎకరాల ప్రభుత్వ భూమిని టీజీఐఐసీకి ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఒకవేళ అది ప్రభుత్వ భూమి అయినా సుప్రీంకోర్టు తీర్పులకు లోబడే ప్రభుత్వాలు పని చేయాల్సి ఉంటుంది. కంచ గచ్చిబౌలి భూముల వద్ద భారీ వాహనాలను ఉపయోగించి చెట్లను కొట్టేసి, భూమిని చదును చేస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అటవీ ప్రాంతాన్ని కొట్టివేయాలంటే నిపుణుల కమిటీ వేయాలి. వన్య ప్రాణులు ఉన్న చోట భూములు చదును చేయాలంటే నిపుణుల కమిటీ పర్యటించాలి. నెల రోజుల పాటు అధ్యయనం చేయాలి. అక్కడ మూడు లేక్ లు ఉన్నాయి. రాక్స్ ఉన్నాయి. ఎన్నో రకాల అరుదైన జంతువులున్నాయి. వాటిని పరిరక్షించాల్సిన అవసరం ఉంది. అయితే, ఇక్కడ సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారు. కొన్ని రోజులుగా ఈ భూముల దగ్గర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి" అని కోర్టుకు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్రెడ్డి వాదనలు వినిపించారు. "2004లో ఈ భూమిని ఐఎంజీ అకాడమీకి అప్పగించారు. ఒప్పందం ప్రకారం ఐఎంజీ ఈ భూములను వినియోగించలేదు. దీంతో అప్పటి ప్రభుత్వం కేటాయింపును రద్దు చేసింది. ఆ భూముల్లో అటవీ భూమి అని ఎక్కడా లేదు. దీనికి ఆనుకొని ఉన్న హెచ్సీయూ భూముల్లో భారీ భవనాలు నిర్మించారు. నాలుగు హెలీప్యాడ్లున్నాయి. హైదరాబాద్లోని చాలా ప్రాంతాల్లో పాములు, నెమళ్లు, చెట్లు ఉన్నాయి. పిటిషనర్ల వాదనల ప్రకారం ఆయా ప్రాంతాలను కూడా అటవీ భూములుగా ప్రకటించాల్సి ఉంటుంది. ఈ లెక్కన హైదరాబాద్ మహానగరంలో ఎక్కడా నిర్మాణాలు చేపట్టకూడదు" అని ఏజీ వాదనలు వినిపించారు. ఇరువైపుల వాదనలు విన్న ధర్మాసనం రేపటి వరకు ఆ భూముల్లో పనులు ఆపాలని ఆదేశిస్తూ.. పిటిషన్పై విచారణను వాయిదా వేసింది.




# తితిదేపై సీఎం చంద్రబాబు సమీక్ష

తితిదే పై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు.

అమరావతి, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) పై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అమరావతిలోని సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యాలు మెరుగుపరిచేందుకు గత 9 నెలల్లో తీసుకున్న చర్యలపై తితిదే అధికారులు సీఎం ఎదుట ప్రజంటేషన్ ఇచ్చారు. భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా భవిష్యత్లో చేపట్టాల్సిన చర్యలపై సీఎం దిశానిర్దేశం చేశారు.





దర్శనాలు, వసతితో పాటు వివిధ సేవలపై భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపైనా చర్చించారు. బ్రహ్మోత్సవాలు, రథసప్తమి, వైకుంఠ ఏకాదశి వంటి ప్రత్యేక సమయాలతో పాటు సాధారణ రోజుల్లో భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సీఎం సమీక్షించారు. శ్రీవారి లడ్డు, అన్నప్రసాదంలో తీసుకొచ్చిన మార్పులపై అధికారులు నివేదిక అందించారు. గ్యాలరీల్లో సౌకర్యాల పెంపు, మరింత మంది భక్తులకు కనిపించేలా మాడవీధుల్లో ఏర్పాట్లను అధికారులు వివరించారు. అలిపిరిలో ఉన్న భక్తుల కోసం బేస్ క్యాంప్ నిర్మాణం, పద్మావతి అమ్మవారి దేవాలయం అభివృద్ధికి ప్రణాళిక, అమరావతిలో శ్రీవారి ఆలయం అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సీఎం చర్చించారు. వీటికి సంబంధించిన నమూనాలను ఆయన పరిశీలించారు. రాష్ట్రం వెలుపల నిర్మాణంలో ఉన్న శ్రీవారి ఆలయాల పురోగతిపై అధికారులు నివేదిక అందించారు. తిరుమల ప్రతిష్ఠ పెంచడంతో పాటు భక్తులకు మరింత దగ్గర చేయడం, సులభమైన, సౌకర్యవంతమైన సేవలకు సంబంధించిన వివరాలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు.

## బీసీలను బలపర్చాలనే ఆలోచనకు భాజపా వ్యతిరేకం: తెలంగాణ సీఎం రేవంత్

బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది.

ఢిల్లీ, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): బీసీ సంక్షేమ సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వేదికగా బీసీ సంఘాల ధర్నా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "బీసీల గొంతు వినిపించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశాం. జనాభా ఎంతో తెలియకుండా రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయి. స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలి. జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలనేది మా పార్టీ నిర్ణయం. బీసీలను బలపర్చాలనే ఆలోచనకు భాజపా వ్యతిరేకం. బీసీల లెక్కలు తేల్చాల్సి వస్తుందని 2021 జనాభా లెక్కలను వాయిదా వేశారు. జనగణనతోపాటు కులగణన చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. ఆ నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు అమలు చేయాలి" అని సీఎం అన్నారు.



## ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నందుకు గర్వంగా ఉంది:మంత్రి నారా లోకేశ్

'యువగళం' పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను నేరుగా చూశానని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు.

పీసీ పల్లి, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): 'యువగళం' పాదయాత్ర సమయంలో ప్రజల కష్టాలను నేరుగా చూశానని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. గత ఐదేళ్లు రాష్ట్రంలో విధ్వంస పాలన కొనసాగిందని చెప్పారు. ప్రకాశం జిల్లా పీసీ పల్లి మండలం దివాకరపల్లి సమీపంలో రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేయనున్న కంప్రెస్ట్ బయో గ్యాస్ ప్లాంట్(సీబీజీ)కు లోకేశ్ శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు.



"ఉమ్మడి ప్రకాశం జిల్లా అంటే గుర్తొచ్చేది ప్రేమ, పౌరుషం. ఈ జిల్లాకు సీఎం చంద్రబాబు, తెదేపా అంటే చాలా గౌరవముంది. 2019లో ఎదురుగాలి ఉన్నా ఇక్కడి నుంచి నలుగురిని తెదేపా ఎమ్మెల్యేలుగా గెలిపించారు. 2024 ఎన్నికల్లో 10 సీట్లలో విజయం అందించారు. ఈ జిల్లాలో యువగళం పాదయాత్ర ప్రభంజనంలా సాగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాకు గత ప్రభుత్వం ఏమీ చేయకపోగా వాటాలు ఇవ్వలేదని ఉన్న సంస్థలను తరిమేసింది. వైకాపా హయాంలో తీసుకొచ్చిన ఒక్క కంపెనీ పేరైనా చెప్పాలని డిమాండ్ చేస్తున్నా. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు రూ.8లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయి. దానికి సంబంధించిన పనులు ప్రారంభించాం. దానిలో భాగంగానే బయో గ్యాస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నాం. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నందుకు గర్వంగా ఉంది. ఈ ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇవ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన" అని లోకేశ్ అన్నారు.

## కంచ గచ్చిబౌలి భూములపై నివేదిక ఇవ్వండి... కేంద్రం ఆదేశం

కంచ గచ్చిబౌలి భూములపై ఆందోళనలు వ్యక్తం అవుతున్న వేళ.. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది.


ఢిల్లీ, ఏప్రిల్ 2, (రిపబ్లిక్ న్యూస్): కంచ గచ్చిబౌలి భూములపై ఆందోళనలు వ్యక్తం అవుతున్న వేళ.. దీనిపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. కంచ గచ్చిబౌలి భూములపై నిజనిర్ధరణ నివేదిక పంపాలని తెలంగాణ రాష్ట్ర అటవీశాఖను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సమాచారం అందించింది. కోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకొని ముందుకు వెళ్లాలని, అటవీ చట్టానికి లోబడి వెంటనే చర్యలు తీసుకోవాలని కేంద్రం సూచించింది. వాస్తవ నివేదిక, తీసుకున్న చర్యలపై నివేదిక ఇవ్వాలని పేర్కొంది.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- **1725:** వెనిస్‌కు చెందిన ఒక సాహసికుడు, రచయిత గియాకోమో కాసనోవా జననం (1798).
- **1872:** అమెరికన్ చిత్రకారుడు, టెలిగ్రాఫ్ వ్యవస్థ ఆవిష్కర్త సామ్యూల్ F. B.మోర్స్ మరణించాడు (జ. 1791). (చిత్రంలో)
- **1915:** రంగస్థల, సినిమా నటుడు, సంగీత దర్శకుడు, నేపథ్యగాయకుడు కొచ్చర్లకోట సత్యనారాయణ జననం (మ. 1969).
- **1969:** భారత సినీ నటుడు అజయ్ దేవగన్ జననం.
- **1933:** క్రికెట్ ఆటగాడు మహారాజా రంజిత్ సింహ్‌జీ మరణించాడు (జ. 1872). ఈయన పేరిటే భారత్‌లో రంజీ ట్రోఫి పోటీని మొదలుపెట్టారు.
- **1972:** చార్లీ చాప్లిన్ అమెరికా కు తిరిగి వచ్చాడు.
- **2011:** భారత్ క్రికెట్ టీం 28 ఏళ్ళ కలను సాకారం చేసుకుని ప్రపంచ కప్ గెలుచుకుంది.


గియాకోమో కాసనోవా


సామ్యూల్ ఫ్. బీ.మోర్స్


కొచ్చర్లకోట సత్యనారాయణ


అజయ్ దేవగన్


రంజిత్ సింహ్‌జీ


చార్లీ చాప్లిన్


ఇండియా గేట్ వద్ద వేడుకలు

రిపబ్లిక్ స్పోర్ట్స్

# "అనికేత్ వర్మకు హార్దిక్ 'మ్యాగీ' స్టోరీనే స్ఫూర్తి"

యువ బ్యాటర్ అనికేత్ వర్మ దూకుడు సన్రైజర్స్ అభిమానులను ఆకట్టుకుంది.

టాప్ బ్యాటర్లు విఫలమైనప్పటికీ.. అని కేత్ మాత్రం కీలక ఇన్నింగ్స్ రాణించాడు.



సన్రైజర్స్ హైదరాబాద్ యువ ఆటగాడు అనికేత్ వర్మ సూపర్ ఇన్నింగ్స్ ఆడాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో మ్యాచ్లో 41 బంతుల్లోనే 74 పరుగులు చేశాడు. ఎస్ఆర్హెచ్ ఓడినా.. అనికేత్ ఆట మాత్రం ఆకట్టుకుంది. అయితే, 23 ఏళ్ల అనికేత్కు హార్దిక్ పాండ్య ఇన్స్పైర్‌గా నిలిచాడని ఈ యువ ప్లేయర్ అంకుల్ అమిత్ వర్మ వెల్లడించాడు. దాదాపు నాలుగేళ్లపాటు మ్యాగీ న్యూడిల్స్ తినే క్రికెట్ ప్రాక్టీస్కు వెళ్లినట్లు పలు ఇంటర్వ్యూల్లో హార్దిక్ తెలిపిన సంగతి తెలిసిందే. వాటిని విన్న అనికేత్ కెరీర్ను సీరియస్గా తీసుకొని సన్నద్ధమైనట్లు అమిత్ వ్యాఖ్యానించాడు. "అప్పుడు అనికేత్కు 14ఏళ్లు. ఓసారి న్యూస్పేపర్లో ఓ వార్త చదివా. అదే స్టోరీని అకాడమీకి వెళ్తూ అనికేత్కు చెప్పా. అదేరోజు నేను అనికేత్లో ఆటపట్ల ప్యాషన్, పరుగుల దాహం చూశా. కీలక ఆటగాడిగా మారతాడని అప్పుడే భావించా. ఒకసారి స్టేడియం చేరుకున్నాక.. నా పాదాలను తాకిన అనికేత్ 'కొన్ని విషయాలను మీ దృష్టికి తీసుకొస్తున్నా' అని చెప్పాడు. అప్పుడు నేను నవ్వా. కానీ, అతడు మాత్రం సీరియస్ గా తీసుకున్నాడు. హార్దిక్ పాండ్య ఐపీఎల్లోకి డెబ్యూ చేసిన తర్వాత జాతీయ జట్టులోకి వచ్చాడు. అలాగే ఏదొక రోజు అనికేత్ కూడా ఆ స్థాయికి చేరతాడనుకుంటున్నా" అని అమిత్ వెల్లడించారు.

### అనికేత్ బ్యాటింగ్ అదుర్స్: పుజారా

"అనికేత్ బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. అతడిపై ఎలాంటి ఒత్తిడి ఉన్నట్లు కనిపించలేదు. తనదైన షాట్లను ఆడేందుకు ప్రయత్నించి సఫలమయ్యాడు. బౌలర్లపై ఆధిపత్యం ప్రదర్శించిన తీరు అభినందనీయం" అని భారత వెటరన్ క్రికెటర్ ఛెతేశ్వర్ పుజారా వ్యాఖ్యానించాడు. ఢిల్లీ పేసర్ మిచెల్ స్టార్క్ దెబ్బకు 37/4తో కష్టాల్లో పడిన సన్రైజర్స్‌ను తన ఇన్నింగ్స్ అనికేత్ ఆదుకొనేందుకు ప్రయత్నించాడు. ఢిల్లీకి (164 పరుగులు) మెరుగైన లక్ష్యం అందించడంలో కీలక పాత్ర పోషించాడు.

అలియాతో పోలిక..

# నాకు ఏమాత్రం నచ్చలేదు: 'అర్జున్ రెడ్డి' నటి

బాలీవుడ్ నటి అలియా భట్‌తో తనని పోల్చి చూడటంపై నటి షాలినీ పాండే స్పందించారు. అది తనకు ఏమాత్రం నచ్చలేదన్నారు.



బాలీవుడ్ నటి అలియాభట్‌తో తనని పోల్చి చూడటంపై నటి షాలినీ పాండే స్పందించారు. వేరే నటితో తనని పోల్చి చూడటం తనకు ఏమాత్రం నచ్చలేదన్నారు. తనని తనలా గుర్తిస్తే చాలని ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. "ప్రేక్షకులు నన్నెంతగానో ప్రేమిస్తున్నారు. వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి. కొంతమంది నన్ను నటి అలియాభట్తో పోలుస్తూ తమ ప్రేమను తెలియజేస్తున్నారు. మనకు ఇండస్ట్రీలో ఇప్పటికే ఒక అలియా ఉన్నారు. కాబట్టి, ఆమెలా మరొకరు అవసరం లేదు. ఆమెలా ఉండాలని వేరొకరు అనుకోరు. ఎందుకంటే, ఆమె అద్భుతమైన నటి. సినిమాల్లోనే కాదు. నిజ జీవితంలోనూ ఆమె ఎంతో ఉన్నతంగా ఉంటారు. నేను కూడా ఆమె నుంచి ఎంతో స్ఫూర్తి పొందుతుంటా. ఎన్నో విషయాలు నేర్చుకోవాలనుకుంటా. అయితే ఆమెతో పోల్చి చూస్తుంటే మాత్రం పెద్దగా నచ్చదు. నన్ను నాలా గుర్తిస్తే చాలు. నాకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవాలనేది నా ఉద్దేశం" అని షాలినీ పాండే తెలిపారు. సినిమాల్లో రాణించాలనే ఉద్దేశంతో షాలినీ ఇంటినుంచి వచ్చేసిన విషయం తెలిసిందే. 2017లో విడుదలైన 'అర్జున్ రెడ్డి'తో ఆమె హీరోయిన్గా ఎంట్రీ ఇచ్చారు. తొలి చిత్రంతోనే గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఆమె బాలీవుడ్లో సినిమాలు, సిరీస్లు చేస్తున్నారు. షాలినీ పాండే ఇటీవల నటించిన వెబ్ సిరీస్ 'డబ్బా కార్టెల్, షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. నెటిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది. ఎలాంటి బ్యాగ్రౌండ్ లేకుండా పరిశ్రమలోకి అడుగుపెట్టడం వల్ల కెరీర్ ఆరంభంలో తాను కూడా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నానని ఆమె చెప్పారు. తొలినాళ్లలో ఓ దర్శకుడు తనతో ఇబ్బందికరంగా ప్రవర్తించాడని తెలిపారు. అందరి ముందు అతడిపై కేకలు వేశానని వెల్లడించారు. అలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు ఎలా రియాక్ట్ కావాలో తాను తెలుసుకున్నానని చెప్పారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

ఆ పాత్ర ఏఐ కాదు..

# మోహన్లాల్ కుమారుడు నటించాడు :పృథ్వీరాజ్ సుకుమారన్

'ఎల్2: ఎంపురాన్' సినిమాలో మోహన్లాల్ కుమారుడు ప్రణవ్ నటించారని పృథ్వీరాజ్ తెలిపారు.



మోహన్ లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ తెరకెక్కించిన యాక్షన్ థ్రిల్లర్ 'ఎల్2: ఎంపురాన్'. ఇటీవల విడుదలైన ఈ సినిమా వివాదాల్లో చిక్కుకున్న విషయం తెలిసిందే. మరోవైపు ఈ సినిమాలో మోహన్ లాల్ చిన్నప్పటి పాత్ర కోసం ఏఐను ఉపయోగించారంటూ వార్తలు వచ్చాయి. తాజాగా దీనిపై పృథ్వీరాజ్ స్పందించారు. మోహన్లాల్ ఈ సినిమాలో స్టీఫెన్ గట్టుపల్లి అనే పాత్రలో కనిపించారు. ఆయన బాల్యానికి సంబంధించిన కొన్ని సన్నివేశాల కోసం ఏఐను ఉపయోగించారని కొందరు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తాజాగా వాటికి చెక్ పెడుతూ ఆ పాత్రకు ఏఐ ఉపయోగించలేదన్నారు దర్శకుడు. అందులో మోహన్లాల్ కుమారుడు ప్రణవ్ నటించారని తెలుపుతూ ఓ పోస్టర్ను విడుదల చేశారు. ఇక ఈ సినిమాపై వివాదాలు నెలకొన్న నేపథ్యంలో చిత్రబృందం కొన్ని మార్పులు చేసి మరోసారి సెన్సార్ను ఆశ్రయించింది. ఈ మేరకు సెన్సార్ బోర్డు.. పలు సన్నివేశాలకు సంబంధించి 24 'కట్స్' చెప్పింది. కొన్నిచోట్ల ఆడియో మ్యూట్ చేయాలని, కొన్ని పేర్లు మార్చాలని, కొన్ని విజువల్స్ తీసేయాలని, కొన్ని రీప్లేస్ చేయాలని సూచించింది. వివాదాల నేపథ్యంలోనే 'ఎల్2: ఎంపురాన్' మంచి కలెక్షన్లను సొంతం చేసుకుంటోంది. ఇప్పటివరకూ రూ.200 కోట్లు వసూలు చేసింది. ఈ వారంలో రూ.250 కోట్లను తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. ఓవర్సీస్ లోనూ ఈ ఏడాది అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రాల జాబితాలో టాప్లో నిలిచింది.

# ఈ అంశంపై ఇదే చివరి ప్రకటన.. జీవీ ప్రకాశ్తో డేటింగ్పై స్పందించిన దివ్యభారతి

తనపై నిరాధారమైన వార్తలు ప్రచారం చేస్తున్నారంటూ నటి దివ్యభారతి ఆవేదన వ్యక్తంచేశారు. జీవీ ప్రకాశ్ కుటుంబసమస్యలతో తనకు సంబంధం లేదన్నారు.

సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ గాయని సైంధవి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. వీరిద్దరి విడాకులకు కారణం దివ్యభారతి అంటూ ఆమెపై ఎన్నో విమర్శలు వచ్చాయి. ఇప్పటికే ఈ విమర్శలను ఆమె ఖండించారు. తాజాగా మరోసారి ఇన్స్టా వేదికగా పోస్ట్ పెట్టారు. "నాకు సంబంధం లేని వ్యక్తుల కుటుంబ విషయాల్లోకి నా పేరును లాగుతున్నారు. జీవీ ప్రకాశ్ కుటుంబసమస్యలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. ఒక్క విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నా. నేను ఎవరితోనూ డేటింగ్లో లేను. ముఖ్యంగా పెళ్లి అయిన వ్యక్తితో డేటింగ్ చేయను. ఆధారం లేకుండా రూమర్స్ సృష్టించకండి. నేను ఈ విషయంలో ఇప్పటివరకూ మౌనంగా ఉన్నాను. అయితే కొన్ని రోజుల నుంచి ఈ రూమర్స్ హద్దులు దాటుతున్నాయి. ఈ గాసిప్ ల కారణంగా నా పేరు దెబ్బతింటోంది. ఇలాంటి నిరాధారమైన వార్తలు సృష్టించే బదులు సమాజానికి ఉపయోగపడే పనులు చేయండి. నా వ్యక్తిగత గోప్యతను గౌరవించండి. ఈ అంశంపై ఇదే నా మొదటి.. చివరి ప్రకటన" అని రాసుకొచ్చారు. ఇక గతంలో జీవీ ప్రకాశ్ విడాకులపై దివ్యభారతి స్పందించారు. ఆ దంపతులు విడాకులు ప్రకటించిన సమయంలో తనని ఎంతో విమర్శించారన్నారు. తనను తిడుతూ మెసేజ్లు పెట్టారని ఆవేదన వ్యక్తంచేశారు. జీవీ ప్రకాశ్, దివ్యభారతి కలిసి కొన్ని ప్రాజెక్ట కోసం వర్క్ చేశారు. వీళ్లిద్దరూ కలిసి నటించిన 'కింగ్టన్' ఇటీవల విడుదలై విజయాన్ని సొంతం చేసుకుంది.



## ఆరోగ్యం

# ఐస్ వేసిన జ్యూస్‌లు తాగుతున్నారా, బాబోయ్ జాగ్రత్త కొన్ని సమస్యల్ని కోరి తెచ్చుకున్నట్లే, ఏం చేయాలంటే

ఎండలు పెరిగేసరికి ప్రతి ఒక్కరూ దాహాన్ని తీర్చుకునేందుకు గడగడమంటూ డ్రింక్స్ తాగేస్తున్నారు. ఇందులో చిల్లీ జ్యూసెస్ కూడా ఉన్నాయి. ఇంట్లో చేసుకోలేని వారు బయట దొరికే జ్యూస్‌లు తాగుతూ గొంతు తడుపుకుంటున్నారు. అయితే, ఇందులో ఐస్ కలిపినా తాగుతున్నారా.. మీరే ఏరికోరి సమస్యల్ని తెచ్చుకున్నట్లు.

పెరిగిన ఎండలతో చల్లచల్లని డ్రింక్స్‌కి గిరాకీ పెరిగిపోయింది. ఎండల ధాటికి కూల్‌గా ఉండే జ్యూస్‌లు, కూల్ డ్రింక్స్‌కి గిరాకీ తెగ పెరిగిపోయింది. కూల్ డ్రింక్స్ తాగేందుకు జంకేవారు ఎందుకు భయ్యా రిస్క్ అంటూ జ్యూస్‌లకే మొగ్గు చూపుతున్నారు. వీటిని కొంతమంది ఇంట్లో చేసుకుంటే మరికొంతమందికి వీలుకాక బయట దొరికే జ్యూస్‌లు తాగుతున్నారు. అయితే, బయట చాలా మంది వారి స్వలాభాం కోసం ఐస్ కలిపి తయారు చేస్తున్నారు. దీని వల్ల జ్యూస్ తక్కువగా ఉన్నా ఐస్ కలపడం వల్ల ఎక్కువగా కనిపిస్తుంది. మరికొంతమంది కలపకపోయినా చల్లగా ఉంటుందని తాగేవారే కాస్తా ఐస్ వేసి ఇవ్వండని తాగుతున్నారు. దీని వల్ల అప్పటికప్పుడు చల్లగా ఉంటుంది. కానీ, దీని వల్ల ఎన్నో సమస్యలొస్తాయని చెబుతున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకోండి.


### ఐస్ రకాలు



సాధారణంగా ఐస్ రెండు రకాలుగా దొరుకుతుంది. అందులో ఘన, ముడి మంచు. ఘనంగా దొరికే ఐస్‌లో నీరు మాత్రమే ఉంటుంది. ఇది స్వచ్ఛమైన నీటితో తయారు చేయబడుతుంది కాబట్టి, చూడ్డానికి ట్రాన్స్‌పరెంట్‌గా ఉంటుంది. క్యూబ్స్‌లా దొరికే మంచు కూడా హెల్త్‌కి మంచిది. మరొకటి రా ఐస్. దీనిని సరిగా తయారుచేయకపోతే ఆరోగ్య ప్రమాదాలు ఉంటాయి. దీనిని సరిగ్గా లేని నీటితో తయారు చేస్తారు. ఇందులో కలుషితాలు, మలినాలు ఉండొచ్చు.



### రా ఐస్‌తో సమస్యలు




రా ఐస్ తీసుకోవడం వల్ల హానికరమైన బ్యాక్టీరియా ఉంటుంది. దీంతో వ్యాధికారకాలు ఉంటాయి. ముడిమంచుని తయారు చేయడానికి వాడే నీరు ఈ కోలి వంటి బ్యాక్టీరియా, నోరోవైరస్ వంటి వైరస్‌లు సహా వివిధ రకాల సూక్ష్మజీవులని కలిగి ఉంటుంది. వీటిని తీసుకున్నప్పుడు జీర్ణశయాంతర సమస్యలొస్తాయి. దీంతో పాటు ఈ ఐస్‌లో మురికి, కలుషితాలు, కాలుష్య కారకాలు ఉంటాయి. దీంతో తయారైన డ్రింక్స్, ఫుడ్స్ తీసుకోవడం వల్ల అనారోగ్యాలు వస్తాయి. దీంతోపాటు గొంతు సమస్యలు కూడా వస్తాయి.

### జీర్ణ సమస్యలు కూడా



జీర్ణ సమస్యలతో పాటు వాంతులు, విరోచనాలు, డీహైడ్రేషన్ వరకూ ఎన్నో సమస్యలొస్తాయి. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారికి ఎక్కువ సమస్యగా ఉంటుంది. దీంతో పాటు గొంతు బొంగురుపోవడం, దగ్గు రావడం, గొంతు ఇన్ఫెక్షన్స్ పెరుగుతుంటాయి. ఆస్తమా, బ్రాంకైటీస్, సైనెస్ వంటి సమస్యలున్నవారు జాగ్రత్తగా ఉంటే మంచిది. ఊపిరితిత్తుల్లోని ట్యూబ్స్ మూసుకుపోతాయి. దీంతో శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది.



### సమస్యలు రాకుండా



సమస్యలు రాకుండా ఉండేందుకు ముందుజాగ్రత్తలు తీసుకోవాలి. బావి నీరు, శుద్ధి చేయని నీటితో తయారైన ఐస్‌ని వాడొద్దు. బ్యాక్టీరియా, కలుషితాలు పేరుకుపోకుండా ఉండేందుకు రెగ్యులర్‌గా తయారీ చేసే వస్తువులని రెగ్యులర్‌గా క్లీన్ చేయడం మంచిది.

### ఇంటి నుంచే



అదే విధంగా, సాధ్యమైనంతవరకూ బయట దొరికే డ్రింక్స్, నీరు తాగకపోవడమే మంచిది. వీటి బదులు ఇంటి నుంచే వాటర్ బాటిల్, మజ్జిగ, నిమ్మరసం లాంటివి క్యారీ చేయండి. గమనిక :ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.